క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ధూల్‌పేట్ అండర్ గ్రౌండ్ ఫీడర్ పరిధిలో ఈనెల 21న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధూల్‌పేట్, శివలాల్‌నగర్ నాలా, కుల్సుంపురా మినీ స్టేడియం, బలరాం గల్లీ, చున్నేకాబట్టి, జియాగూడ రెండు పడకల ఇండ్ల సముదాయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆర్ఎంఓ జయకృష్ణతో బీఎంఎస్ నాయకులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నాలుగో తరగతి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్ఎంఓ-1 డాక్టర్ జయకృష్ణ హామీ ఇచ్చినట్లు భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు తెలిపారు. సంఘ్ ఉస్మానియా శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను కలిసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జీపీ కృష్ణ, చారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జియాగూడ: మచిలిపురా ప్రాంతంలో ఎస్టీఎఫ్ టీం, ధూల్‌పేట్ ఎక్సైజ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు ఇందర్‌పాల్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం 8.6 కిలోల గంజాయిని పట్టుకుని ఇందర్‌పాల్ సింగ్‌తో పాటు కపూర్‌సింగ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇదే విషయంలో సబన్ సకరం అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్టీఎఫ్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ధూల్‌పేట్‌లోని జుంగూర్‌బస్తీలో కనాల్ సింగ్ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి 1.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కనాల్ సింగ్‌ను అరెస్టు చేశారు. మహేశ్‌సింగ్‌తో పాటు మరో 10 మంది గంజాయి వినియోగదారుల పేర్లను కూడా నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐలు మధుబాబు, గోపాల్‌తో పాటు ఎస్ఐ భాస్కర్‌గౌడ్, లలిత, మహేశ్వర్, సైదులు, భాస్కర్‌రెడ్డి, అజీమ్, శ్రీధర్, ప్రకాశ్, రాకేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఆశాల రాష్ట్ర బస్సుజాతాను జయప్రదం చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చేపట్టిన రాష్ట్ర బస్సుజాతా ఈ నెల 30వ తేదీన రంగారెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఆశా వర్కర్లంతా కృషి చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా ఆశావర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత కోరారు. ఈ మేరకు కాటేదాన్ కార్యాలయంలో ఆశా వర్కర్ల బస్సు జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలోని ఆశాలు అందరూ తరలివచ్చి జాతాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, భాగ్య, శోభ, నవనీత, సంధ్య, ఆశా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగేందర్‌రెడ్డి

అత్తాపూర్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతున్నామని ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకల్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో తమదైన శైలిలో ముందుకు వెళ్తున్నామన్నారు. యువజన కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నామన్నారు.

జాతీయ రహదారే పార్కింగ్!

- నిత్యం మేకల మండికి లారీలు
- జియాగూడ వద్ద రోడ్లపైనే నిలిపివేత
- వాహనదారుల ఇబ్బందులు
- పట్టని అధికారులు



జాతీయ రహదారిపైనే నిలిపిన లారీలు

జియాగూడ: జియాగూడ జాతీయ రహదారిపై లారీలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జియాగూడ మేకల మండి, జాతీయ రహదారి పక్కపక్కనే ఉన్నాయి. దీంతో ప్రతిరోజు ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలు, మేకలను తీసుకువస్తున్న లారీలను రోడ్డుపైనే నిలిపి వేస్తున్నారు. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రద్దీగా జాతీయ రహదారి..

జాతీయ రహదారిపైనే లారీలను నిలిపి వేయడంతో పాటు, చెత్త డంపింగ్ యార్డుకు వచ్చే స్వచ్ఛ్ ఆటోలు, భారీ లారీలు, డంపింగ్ కోసం రహదారిలో గంటల తరబడి నిలిపివేయడం, దీనికితోడూ ఇదే దారిలో పైప్‌లైన్ పనులు నెలల తరబడి కొనసాగుతుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అవుతోంది.అలాగే రోడ్డుకిరువైపులా చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, మద్యం దుకాణాలకు వచ్చే వాహనాలను కూడా గంటల తరబడి ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తున్నారు.

వసతులు కల్పించని జీహెచ్ఎంసీ..

జియాగూడ మేకల మండిలో ఎలాంటి వసతులు కల్పించని జీహెచ్ఎంసీ టెండర్ల ద్వారా మాత్రం పార్కింగ్, గొర్రె, మేకలపై ఫీజు వసూలు చేస్తోంది. అయితే మండికి వచ్చిన వాహనాలకు లోపల స్థలం కేటాయించకపోవడంతో పూర్తిగా జాతీయ రహదారిపైనే నిలిపేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, బస్తీలవాసులు కోరుతున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

సుల్తాన్‌బజార్: పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన అలజడికి నిరసనగా బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో జాంబాగ్‌లో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రవర్తన వల్ల బీజేపీ ఎంపీలు ప్రతాప్‌చంద్ర సారంగి, ముఖేష్ రాజ్‌పుత్‌కు ఎంతో ఇబ్బంది కలిగిందన్నారు. రాహుల్‌గాంధీ, ఆ పార్టీ నాయకులు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, నర్సింగ్, వినోద్, రవి, హరినాథ్, నందీశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తదితరులు

వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలోకి విగ్రహాన్ని తీసుకెళ్తున్న లెనిన్ బాబు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేణుగోపాల స్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠపనను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లెనిన్ బాబు ఆధ్వర్యంలో చెన్నైలో 25 కిలోల పంచలోహలతో సొంత ఖర్చులతో చేయించిన ఈ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ట్రస్టీలు పట్లూరి వెంకటేశ్వర రావు, మురళీధర్ రావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దూద్ బౌలి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తానని పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్ అన్నారు. డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారుల ఇళ్లకు వివరాలు సేకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది హరిత, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

నాంపల్లి: మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడిలో భాగంగా తీవ్రంగా గాయపడిన వీర్‌నగర్ స్థానిక పంచాయతీ కమిటీ ప్రధాన కార్యదర్శి జి.వినోద్‌కుమార్‌ను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు చింతల బస్తీలోని వీర్‌నగర్‌కు చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక పంచాయతీ కమిటీ నేతలు సుదర్శన్, ఆత్మకూరి కాంతి, రవి కుమార్, ఎన్.శక్తి, సరస్వతి, కల్యాణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోటా రిజర్వేషన్ జీఓను సవరించాలి



ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కృష్ణమూర్తి గౌడ్

గన్‌ఫౌండ్రీ: క్రీడా కోటా రిజర్వేషన్ జీఓను సవరించాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం (పెటా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి గౌడ్ కోరారు. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, శాట్స్ ఎండీ సోనీ బాలాదేవికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత జీఓ ప్రకారం గ్రూప్-1, 2 ఉద్యోగాలకు అంతర్జాతీయ స్థాయిలో గ్రూప్-3 కి జాతీయ స్థాయిలో, గ్రూప్-4కు విశ్వ విద్యాలయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు మాత్రమే అర్హులుగా ఉంటారన్నారు. ఈ విధానం వల్ల ప్రతిభావంతులైన ఎంతో మంది క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత జీఓను సవరించి క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ బిల్లును ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో విజయనగర్‌కాలనీ నారాయణ పాఠశాల విద్యార్థులు టి.వైష్ణవి ఠాకూర్, ఆయూస్ ఠాకూర్ సింగ్ సిల్వర్, కాంస్య పతకం సాధించారు. దీంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా విద్యావేత్తలు జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నెలలో ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంపియన్‌షిప్‌లో జూనియర్ విభాగం 46 కేజీల విభాగంలో వీరిద్దరూ పాల్గొని ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టోలిచౌకీ చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దుతాం



టోలిచౌకీ చౌరస్తాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దుతామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ చౌరస్తాలో చేపడుతున్న డ్రైనేజీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోలిచౌకీలో వరద నిల్వ ఉండకుండా ఉండేందుకే బాక్స్ డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. నగరంలోనే అత్యంత పెద్ద లేబర్ అడ్డా టోలిచౌకీ చౌరస్తా వద్ద ఉన్న ఫ్లైఓవర్ పిల్లర్లకు చదువు ప్రాముఖ్యత, బాలకార్మిక వ్యవస్థను వ్యతిరేకించే చిత్రాలను వేయిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే టోలిచౌకీ ఫ్లై ఓవర్ కింద ప్రదేశంలో ప్రస్తుతం ఉన్న మొక్కలకు తోడుగా పూలు, ఔషధ మొక్కలు కూడా నాటుతామన్నారు. ఆయన వెంట టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, నాయకులు మజీద్‌ఖాన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో డీహెచ్ రవీంద్రనాయక్

సుల్తాన్‌బజార్: డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ కేక్ కట్ చేసి ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యశాఖ ఎంతో కీలకమైందని అధికారులు, ఉద్యోగులు ప్రజల కోసం పని చేయాలని, అప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో అన్ని మతాల వారు ఉంటారని అన్ని పండుగలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ కాకుమాను శశిశ్రీ, అధికారులు శ్వేత మంగా, కిరణ్‌రెడ్డి, మామిడి ప్రభాకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



పూజల్లో రాజు వస్తాద్, సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో గోల్కొండలో శుక్రవాంర అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్.రాజువస్తాద్‌తో పాటు బీ సాయిబాబాచారి తదితరులు హాజరయ్యారు. అదేవిధంగా గుడిమల్కాపూర్‌లో అంబటి క్రాంతిసాగర్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో రాచకొండ గోపిసాగర్, గురుస్వామి వైద్యనాథ్, ఆనంద్‌గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



గుడిమల్కాపూర్‌లో ..

ఆసిఫ్‌నగర్‌లో..

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్‌లో కన్నె స్వామి ప్యారసాని శివకుమార్ ఆధ్వర్యంలో గురుస్వామి సమక్షంలో అయ్యప్ప మహాపడిపూజను నిర్వహించారు. శ్రీ ఓంకారేశ్వర్ భజనమండలి భక్త బృందం ఆలపించిన అయ్యప్ప గీతాలు అలరించాయి. అనంతరం అన్నదాన ప్రభు ప్యారసాని దుర్గమ్మ ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు బాలచందర్, సామంత్‌కుమార్, వేణు, యాదగిరి, నర్సింగ్, వెంకటేశ్, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో అయ్యప్ప దీక్షాపరులు

ఏఐఎస్ఎఫ్ నాయకుల చలో అసెంబ్లీ ముట్టడి



ఏఐఎస్ఎఫ్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు నేతలను అరెస్టు చేసి అంబర్‌పేట్, షాహినాయత్‌గంజ్ పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం వల్ల పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వమని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి, ఆయా కళాశాలలను సీజ్ చేయాలని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్లను నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడుపల్లి లక్ష్మణ్, భాషాబోయి సంతోష్, ముదిగొండ మురళి, మచ్చ రమేశ్, చైతన్య యాదవ్, అంజి, శరత్, దత్తురెడ్డి, లోకేష్, పార్థసారధి, శివ, అభిరాం, ప్రవీణ్, శ్రావణి హరీశ్, రవితేజ, చరణ్ పాల్గొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'

గన్‌ఫౌండ్రీ: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రం హోంమంత్రి అమిత్‌షా బర్తరఫ్ చేయాలని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఎస్.దినేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. గన్‌ఫౌండ్రీలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని నిర్మించి దేశంలో కోట్లాది మంది అణగారిన వర్గాల గొంతుగా మారి అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన అంబేడ్కర్‌పై అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. అమిత్‌షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రొఫెసర్ వీణపాణికి రతన్ టాటా అవార్డు



చార్మినార్: సరోజినినాయుడు వనితా మహా విద్యాలయం పీజీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీణపాణికి రతన్ టాటా ఎక్సలెన్సీ అవార్డు-2024 కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ వీణపాణి 31 రీసెర్చ్ పబ్లికేషన్స్ ద్వారా ఎన్నో ప్రచురణ పత్రాలు ప్రచురించి అందరి మన్ననలు పొందారన్నారు. అంతేగాకుండా జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రొఫెసర్‌గా, వక్తగా సదస్సుల్లో ప్రసంగించి అపారమైన అనుభవం గడించారని పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, స్వచ్ఛభారత్, బిజినెస్ మేనేజ్‌మెంట్ లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 28న అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో రతన్ టాటా 86వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జరిగే కార్యక్రమంలో ప్రొఫెసర్ వీణపాణికి అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

పని చేసిన సంస్థకే కన్నం

- సెల్‌ఫోన్ టవర్ల రేడియో రిమోట్ యూనిట్ బాక్స్‌ల చోరీ
- గతంలో ఇద్దరూ టెక్నీషియన్లుగా వర్క్ చేసినవారే
- నిందితుల అరెస్టు, రూ 12 లక్షల సొత్తు స్వాధీనం




పట్టుబడ్డ నిందితులు

జియాగూడ: సెల్ టవర్ల రేడియో రిమోట్ యూనిట్ బాక్సులను దొంగిలించిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి రూ.12 లక్షల విలువచేసే బాక్సులను స్వాధీనం చేసుకున్నట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్, ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. వారు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 6న జియాగూడలోని జాతీయ రహదారిలో గల కట్టమైసమ్మ ఆలయం వద్ద ఓ ఇంటిపై ఉన్న ఎయిర్‌టెల్ టవర్‌కు ఉన్న రేడియో రిమోట్‌ను దొంగిలించారు. దీంతో పరిసర ప్రాంతాల్లో సిగ్నల్స్ సరిగా రావడం లేదని వినియోగదారులు ఎయిర్‌టెల్ ఆఫీస్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత సిబ్బంది వచ్చి పరిశీలించగా రేడియో రిమోట్ యూనిట్ బాక్స్ దొంగతనం జరిగినట్లు గుర్తించి కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ద్వారా నిందితులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాగా జియాగూడ 2జీ బస్టాండ్ పటేల్ హోటల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిషన్‌బాగ్‌కు చెందిన సోహేల్ సరారుద్దీన్ (33) అలాగే కార్వాన్ బాంజవాడికి చెందిన పి.నవీన్(29) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఇద్దరు కూడా గతంలో ఎయిర్‌టెల్ టవర్ టెక్నీషియన్లుగా పనిచేసి మానేశారు. వీరిద్దరు స్నేహితులు. జియాగూడతో పాటు నగరంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, అత్తాపూర్ ప్రాంతాల్లోని ఎయిర్‌టెల్ టవర్ల నుంచి కూడా రేడియో రిమోట్ యూనిట్ బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. వీరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా బాక్సులు తమ ఇంట్లో ఉన్నట్లు తెలపగా వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కోట.. కిటకిట

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట శుక్రవారం పర్యాటకులతో కిటకిటలాడింది. కోటను చూసేందుకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోట గోడలపై ఆయుధాగారం, ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు.


